

# బాస్

**-ఎనుగంటి వేణుగోపాల్**

"సర్!" వినయంగా పిలిచాడు గోపాలం.

బాస్ తలెత్తి ఏమిటన్నట్లు చూశాడు గోపాలం వంక. చూసినట్టుగా లేదు. గుడ్లురిమినట్టన్పించింది.

తన చేతిలోని కాగితం బాస్ కందించాడు బెరుకు బెరుగ్గా.

"రిజైన్ లెటరా?" వెటకారం ధ్వనించింది.

"భార్యాపిల్లలు ఉన్నవాడ్ని. నా యావత్ కుటుంబ మంతా నా ఒక్కడి మీదే ధారం. నాకీ ఉద్యోగమే కద్సార్ దిక్కు. మరో రాబడి లేనివాడ్ని. అలాగంటారేంటి?" అన్నాడు కట్టుకున్న చేతుల్ని మరింత బిగిస్తూ.

"మరేంటీ ఉత్తరం?" చదవకుండానే అడిగాడు.

'కళ్లు దొబ్బినయా... వెధవ టెక్కు... నాతో చెప్పించడం కాకపోతే!' స్వగతాన్ని గొంతులోనే నొక్కేసి-

"ట్రాన్స్‌ఫర్‌కి అప్లికేషన్ సార్!" పైకి అన్నాడు.

"ఇప్పుడేం ముంచుకొచ్చిందని?"

'నాక్కాదు. నీలాంటి బాసుల్ని ఆ సునామీ ముంచనం దుకు' పళ్లు నూరుతూ గోపాలం ఏదో అనబోయాడు.

"ఆ మధ్య ఎప్పుడో ట్రాన్స్‌ఫర్‌కి అప్లికేషన్ పెట్టుకు న్నట్టు గుర్తు" సాలోచనగా అన్నాడు బాస్.

'మెమోరీకేం ఢోకాలేదు. దాన్ని హెడ్డాఫీసుకి పంపావో... ఇక్కడే చింపావో ఎవడికి తెలుసు?' స్వగతమాపి...

"అవున్సార్. కానింత వరకు వాళ్ళు ఎలాంటి యాక్షన్ తీసుకున్నట్టు లేదు. మరోసారి పంపితేనైనా ఫలితం ఉండొచ్చని..." నసిగాడు.

"ఇక్కడ పని బర్డనేం లేదుగా! టెన్షన్లసలే లేవు. హాయిగా ఇక్కడే ఉండిపోక ఎందుకోయ్ ట్రాన్స్‌ఫరా గ్రా"

"అబ్బాయికి ఫిఫ్త్ స్టాండర్డ్ పూర్తయ్యింది సార్. అప్పర్ ప్రైమరీ ఎడ్యుకేషన్ ఇక్కడంతగా బాగా లేద్సార్. డిస్ట్రిక్ట్ హెడ్‌క్వార్టర్స్‌కి వెళ్దామనుకుంటున్నాను. పైగా నాన్నకి అనా రోగ్యం. మంచి వైద్యం అందుబాటులో ఉంటుందని" షార్ట్‌కట్‌లో ఏకరువు పెట్టాడు.

అసలు విషయం అది కాదు. అతను వెళ్ళాలనుకుం టున్న జిల్లా ఈ మధ్యనే కార్పొరేషనయింది. థర్టీ పర్సెంట్ డి.ఏ. వస్తుంది. తరచూ ఓ.డి.లు తగుల్తాయి. అడపాద డపా 'అవీ' ముడతాయి. అలా అన్నీ తోడై సాలరీ గ్రాఫ్ మరింత పెరుగుతుంది. అదీ గోపాలం ట్రాన్స్‌ఫర్ ప్లాన్ లోని తెర వెనుక అంశం!

"కాకమ్మ కబుర్లేం చెప్పకు, నేనిక్కడున్నంత వరకు నీ ట్రాన్స్‌ఫర్ అప్లికేషన్ ఫార్వర్డ్ చేయను. చేసే ప్రసక్తే లేదు. ఇదిగో ఈ కాగితం ముక్కని నీ చేతుల్తోనే ఎంచక్కా చింపేసి, డస్ట్‌బిన్‌లో తోసేసి, వెళ్ళి బుద్ధిగా పన్జూసుకో!" హుకుం జారీ చేశాడు.

"అది కాద్సార్..." నీళ్లు నమిలాడు.

"ఏది కాదు. నథింగ్ డూయింగ్. నేనేమీ వినను. ఫార్వర్డ్ చేయనుగాక చేయను. వెళ్లువెళ్లు. మెమోలు రాకుండా చూసుకో. అది చాలు. జాబ్ కెరీర్ పాడవుద్ది!" కాస్త సీరియస్ అయ్యాడు బాస్ నరసింహమూర్తి.

చేసేదేం లేక బాస్ దగ్గర నుండి తన అప్లికేషన్ పేపర్ని తీసుకొని, జేబులో తోసేసి, మరోమాట మాట్లాడకుండా బయటికి నడిచాడు.

* * *

"వీడేం మనిషయ్యా బాబూ! ట్రాన్స్‌ఫర్ కావాలి మొర్రో అని మొత్తుకున్నా నోరు మెదపడు. కాగితం కదపడు. తేడాలు రాకుండా మాత్రం అప్ టు డేట్ వర్క్ మాత్రం చేయించుకుంటాడు" బాస్ మీద ఎగిరెగిరి పడ్డాడు గోపాలం.

"మరి గత నెలలో ఆ యు.డి.సి. మాధవయ్యని అడగ్గానే బదిలీ చేయించాడు కదా! అదీ బాస్ స్వయంగా రిస్క్ తీసుకొని!" సందేహం వెలిబు చ్చాడు పక్కసీటు రాంబాబు.

"అదే అర్థం కావడం లేదు. పైగా ఆ పోస్ట్ ఇప్ప టికీ సిలప్ ఐ మరొకరిక్కడికి వచ్చిన దిక్కే లేదు. ఆ పని భారం తలా ఇంత మోస్తూనే ఉన్నాంగా" గోపాలం కంటిన్యూ అయ్యాడు.

"బాస్ లంచం పుచ్చుకున్నాడంటావా?" అనుమానం వ్యక్తపరిచాడు.

"ఛఛ! అలాంటిదేం లేదు. బాస్ చండశా సనుడేమో కానీ లంచగొండి కాదు. ఆ విష యంలో నిప్పు... నిప్పులాంటి మనిషి.

"మరి నీ విషయంలో ఇలా ఎందుకు పట్టు పట్టాడు? బాస్‌ని నువ్వు తిట్టుకోవడం... మా ముందు చెడామెడా దులపడం... ఎప్పుడైనా విన్నాడేమో?"

"వింటే మాత్రం. మొహం పట్టుకుని నిలదీ యాలి. అంతే తప్ప ఇలా ట్రాన్స్‌ఫర్ కానివ్వ కుండా దొంగాట లేంటి? వీడొక్కడే ఉన్నాడేంటీ బాస్ లోకంలో?"

"ఎంత గింజుకున్నా ఏం లాభంలే! ఇతగాడిక్క డున్నంత కాలం నీకు గ్రహణం పట్టినట్టే. నీ ట్రాన్స్‌ఫర్ మాట మర్చిపోయి కనీసం బాస్ ఎప్పుడు ట్రాన్స్‌ఫర్ అవు తాడా అని ఎదురుచూస్తూ ఉండు. అంతే తప్ప చేసేదేం లేదు".

"చేతులు ముడుచుక్కూర్చోమంటావా? ఇంకా నయం. బాస్ కాళ్లు పట్టుకొని బ్రతిమిలాడమని సలహా ఇవ్వలేదు. అయినా ఇక ఉపేక్షించేది లేదు. తాడోపేడో తేల్చుకుం టాను. బాస్ ఇప్పటి వరకు నా వినయ విధేయతల్ని చూశాడు. ఇక నా తడాఖా చూస్తాడు. చెడుగుడు ఆడిం చేస్తా..."

"ఏం చేస్తావ్?"

"చెప్పను చేస్తా...'

"సరే! బెస్టాఫ్ లక్..."

"నో! బెస్టాఫ్ ట్రాన్స్‌ఫర్..."

* * *

"లంచాల వ్యవహారం జోరుగా నడుస్తోందిట. ఆఫీస్ ఎందుకిలా తయారయ్యింది? అసలేం జరుగుతోంది క్కడ? రిటైర్మెంట్‌కి దగ్గరగా ఉన్నావనే ధీమానా?" నరసిం హమూర్తిని నిలదీశారు హెడ్డాఫీస్ నుండి ఎంక్వైరీకి వచ్చిన స్పెషల్ ఆఫీసర్లు.

'ఎవరో మెసేజ్ అందించి ఉంటారు' అనుకున్నాడే తప్ప తొణకలేదు. బెణకలేదు. గంభీరంగా ఉండిపోయాడు బాస్.

స్పెషల్ స్క్వాడ్ సడెన్ విజిట్‌కి రావటంతో స్టాఫ్ మాత్రం బెదిరిపోయారు.

ఫైలు ఫైలుకీ వెరిఫికేషన్ స్టార్ట్ చేశారంటే ఎవరో ఒకరు ఎక్కడో ఓ చోట దొరక్కపోరు. పనిష్మెంట్లు, మెమోలు... అదో తలనొప్పి . అదీ వాళ్ళ భయం.

"ఈ ఫైర్ అంటించింది నువ్వు కాదు కదా!" పక్కకి జరిగి వంగి గోపాలం చెవిలో గొణిగాడు రాంబాబు అనుమానంగా.

"నో డౌట్. నేనే!"

"కొంప ముంచావ్ గోపాలం. అది చేస్తా. ఇది చేస్తా అంటే ఏం చేస్తావో అనుకున్నాను. ఇదా నువ్వు వెలగబెట్టింది. ఛ! ఎంత పని చేశావ్. అందరూ టెన్షన్‌తో హడలి ఛస్తున్నారు"

మరి మాట్లాడలేదు గోపాలం. మౌనంగా తన పనేదో తాను చేసుకోసాగాడు.

స్పెషల్ ఆఫీసర్లు ఆఫీసునంతా పీసు పీసు కింద చెక్ చేశారు. అణుమాత్రం వాళ్ళకేం దొరకలేదు. ఫైల్సన్నీ అక్షరమక్షరం గాలించేశారు. కించిత్ మిస్టేక్ అగుపడలేదు. తామెవరమైంది తెలుపకుండా ఊళ్లో వాళ్లని రహస్యంగా ఆరాతీశారు ఆఫీసు గురించి, ఆఫీసర్ గురించి.

"బాస్‌కి క్లీన్ చిట్ ఇచ్చార్ట. నువ్వు చేసిన ఘన కార్యానికి బాస్ ఇమేజ్ ఆకాశమంత ఎత్తుకి ఎదిగిపోయింది. రేప్పొద్దున డైరెక్ట్‌గా హెడ్డాఫీసుకి నీ వెళ్ళి ఏదో పరపతితో ట్రాన్స్‌ఫర్ అప్లికేషన్ పెట్టుకున్నా మన బాస్ అభిప్రాయం తెల్సుకోందే నీకు ఆర్డర్స్ చేతిలో పెట్టని లెవెల్‌కి బాస్‌ని పెంచేసావనుకో"

రాంబాబు చెబుతోంది చెవినపడ్డ గోపాలం కూల్‌గా ఉండిపోయాడు.

తన పాచిక పారనందుకు, బాస్ మీద అక్షింతల వర్షం పడనందుకు ఫీలవలేదతను. మరో ఎత్తుగడకి కసరత్తు మొదలెట్టాడు.

★ ★ ★

"మిమ్మల్ని బాస్ రమ్మంటున్నారు సార్!" గోపాలం చెంతకి కబురు మోసుకొచ్చాడు అటెండర్ నందయ్య.

'ఎప్పుడు పిలుస్తాడా అని మొన్నటి నుండే వెయిట్ చేస్తున్నా. మొదలయ్యిందన్నమాట వార్. ఇక ఇలా పిలుస్తూనే ఉంటాడ్లే' ఓ టైపులో నవ్వుకున్నాడు.

"అదేంటోయ్ గోపాలం. బాస్ పిలుస్తుంటే సీరియస్‌గా మొహం పెట్టడం మానేసి... ఇలా లుక్స్ ఇస్తావేంటీ?" ఆశ్చర్యపోయాడు రాంబాబు.

"పాచిక విసిరా. అదీ మేటర్" అతడికి మాత్రమే వినపడేలా అనేసి హుందాగా బాస్ గదిలోకి ఎంటరయ్యాడు.

ఈసారి మాత్రం చేతులు కట్టుకోలేదు. నిర్లక్ష్యంగా నిలబడ్డాడు చూద్దాం లెమ్మని.

"రావోయ్ గోపాలం. అలా కూర్చో" అన్నాడు నరసింహమూర్తి ఎదురుగా కుర్చీ చూపిస్తూ.

అప్పుడు చూశాడు గోపాలం భయంగా. ఏం జరగబోతోందని కాదు. ఎన్నడూ లేంది ఇలా కూర్చోమంటున్నాడని.

"ఫర్లేదు. కూర్చోవయ్యా!" గట్టిగా అనేసరికి గభాల్న కూలబడ్డాడు.

"నీ బుర్ర ఇంత షార్ప్‌గా పని చేస్తుందని నాకింత వరకు తెలీదయ్యా. భలే పన్చేసావు" అంటూ బుర్ర మీసాల్ని ఎడంచేత్తో ఓసారి పైకి దువ్వాడు.

గతానికి భిన్నంగా ప్రవర్తిస్తున్న బాస్ ధోరణికి కుతకుతలాడిపోతోంది గోపాలానికి.

"ఏమో అనుకున్నాను. మొత్తానికి ఘటికుడివే. ఆఫీస్ తరపున నీవు పంపిన కొటేషన్ ఫెంటాస్టిక్. టెండర్ మనకే దక్కింది. రియల్లీ వండర్. నేనస్సలు ఊహించలేదు. ఎనీహౌ కంగ్రాట్స్"

నరసింహమూర్తి చిర్నవ్వుతో చెబుతుంటే బుర్ర గిర్రున తిరిగిందతనికి. తల పట్టుకున్నాడు.

'ఆర్నీ! తానొకటి తలిస్తే దైవమొకటి తలవడమంటే ఇదేనా? చెడకొడదామని ప్లానేస్తే ముడిపడిందా?' బిక్క మొహం వేశాడు గోపాలం.


"సర్లే నువ్వెళ్లు. ఆనందంతో నీ నోట మాట కూడా రావడంలేదు చూడూ! ట్రాన్స్‌ఫర్... ట్రాన్స్‌ఫర్... అంటూ తెగ ఇదైపోయావు. నువ్వు ట్రాన్స్‌ఫరై వెళ్ళిపోతే మనకీ క్రెడిట్ దక్కేనా? అందుకేనయ్యా పెద్దవాళ్ల మాట వింటుండాలి"

"వెరీ హాపీ సార్!" ఏడ్పు మొహంతో బయటపడ్డాడు.

★ ★ ★

"ఏం గోపాలం? చెప్పా పెట్టకుండా ఏకబిగిన నాల్రోజులు లీవ్ పెట్టావు. హెల్త్ ప్రాబ్లమా?" రాంబాబు అడిగాడు.

"హెల్త్ ప్రాబ్లమ్ లేదు పాడూ లేదు. బోలెడు సిఎల్స్ మిగిలి ఉన్నాయి. పెట్టేదామని పెట్టేశా. పనలో పనిగా ధర్మపురి, వేములవాడ, కొండగట్టు పుణ్యక్షేత్రాలు చుట్టి వచ్చాను. మిసెస్ కూడా చాన్నాళ్ల నుండి అంటోంది. ప్రసాదం ఎల్లుండి శనివారం పట్టుకు వస్తాను" చెప్పాడు గోపాలం.



'మెప్పు తనకి. తిప్పలు మాకా? దొరికిన చేపను దొరికినట్టు నొక్కేసి, ఎవీ ఎరగనట్టు జపం చేసుకున్న కొంగలా... చేసేదంతా చేస్తూనే తామర తుంపర్లలా పొగడ్తలొకటి నంగనాచి బాసూ!'

"అన్నట్టు చెప్పడం మరిచాను. మన బాస్ ఫుల్లు హాపీగా ఉన్నాడు"

"ఆయనకి హామీగానే ఉంటుంది. ఏడుపంతా మనకి కదా! ఏంటీ కథ?"

"మన కంపెనీ గ్రూప్స్‌లో ఏటా ఇచ్చే 'బెస్ట్ మేనేజర్' అవార్డు ఈ యేడుకి మన బాస్‌ని వరించిందని మెసేజ్ వచ్చింది"

గతుక్కుమన్నాడు గోపాలం.

'అదేంటో? బాస్‌ని ఇరికించాలని తను ఎత్తుగడలు వేస్తోంటే ఇలా రివర్స్ అవుతోంది. గట్టి పిండంలా ఉన్నాడు' ఆలోచన్లాపి.

"ఇతగాడు తప్ప సూటబుల్ పర్సన్ మరెవరూ దొరకలేదటనా?" అక్కసు వెళ్ళగక్కాడు.

"ఇదంతా తమరి పుణ్యమే అయ్యుంటుంది. బురద నీకంటుతోంది స్ప్రే బాస్ దగ్గర స్ప్రెడవుతోంది"

"ఏం చేస్తాం? మహర్జాతకులుంటారు కొందరు, మన లాంటి వాళ్ళకు ట్రాన్స్‌ఫర్‌కే దిక్కు లేదు. ఆయనగారికేమో క్లీన్‌చిట్‌లు, ప్రశంసలు, అవార్డులు"

"ఈ సందర్భంగా బాస్ చిన్న స్వీట్ పార్టీ అరెంజ్ చేస్తానన్నాడు. నువ్వు లేవని ఆగాడు. ఈ రోజుంటుందేమో!" రాంబాబు మాటలు పూర్తవనే లేదు నోటీసు బుక్‌తో ఎంటరయ్యాడు అటెండర్ నందయ్య.

"అదేనా?" అడిగాడు రాంబాబు.

"తమరి నోటి చలవ సార్! సాయంత్రం ఆఫీసయ్యాక ఆఫీసులోనే..." చెప్పాడు నందయ్య.

నోటీసు చదవకుండానే ఇద్దరూ సైన్ చేశారు.

ఎగపప్స్ - కర్రీపప్స్, స్వీట్లు, కూల్‌డ్రింక్స్ తెప్పించాడు. నరసింహమూర్తి స్టాఫందరితో ఉల్లాసంగా మాట్లాడాడు. పేరు పేరునా అందరినీ అభినందించాడు.

గోపాలానికి కోపం నసాళానికంటుతోంది.

'మెప్పు తనకి. తిప్పలు మాకా? దొరికిన చేపను దొరికినట్టు నొక్కేసి, ఎవీ ఎరగనట్టు జపం చేసుకున్న కొంగలా... చేసేదంతా చేస్తూనే తామర తుంపర్లలా పొగడ్తలొకటి నంగనాచి బాసూ!' గోపాలం అంతరంగం అతలాకుతలముతోంది.

ముప్పావు గంటలో పార్టీ ముగిసింది. అందరూ వెళ్ళిపోతుంటే గోపాలాన్ని ఆపాడు నరసింహమూర్తి.

'క్లాసు పీకడానికేముంది?' అర్థమవలేదు గోపాలానికి.

"కంగ్రాట్స్ గోపాలం!" బాస్ అభినందించాడు.

'అవార్డు అతనికొస్తే నాకు కంగ్రాట్సేంటి? తనకి నే చెప్పలేదని ఎకసెక్కమా? తెలివైనోడివే బాసూ' ఏమనాలో తోచక పైకి మాత్రం చేతులు నలుపుకుంటూ ముసిముసిగా నవ్వాడు.

"నిజం చెప్పాలంటే ఈ క్రెడిట్ అంతా నీదేనోయ్"

'నే చేసిన నిర్వాకం తెలిసిపోలేదు కదా!' గతుక్కుమన్నాడు గోపాలం.

"నేనీ బ్రాంచ్‌కి వచ్చినప్పటి నుండి నిన్ను అబ్జర్వ్ చేస్తున్నా. చేసే పనిలో పారదర్శకత, అంకితభావం, ఇలా మరిన్ని సలక్షణాలు నీలో పుష్కలంగా ఉన్నాయి. తొందరపాటుతనం తగ్గించుకొని ఓర్పు అలవరుచుకుంటే యూ ఆర్ పర్ఫెక్ట్ మ్యాన్"

ప్రశంసలతో ముంచెత్తుతున్న బాస్ వాలకానికి గోపాలంలో అనుమానపు తెరలు.

'చాటుగానైనా ఎవ్వరినీ మాట వరసకి కూడా పని బాగా చేస్తావని అనని ఆ బాసేనా? అలాంటప్పుడు నా ట్రాన్స్‌ఫర్ మేటర్ పక్కన పెట్టడం దేనికో?'

"పోతే గుడ్ కండక్ట్ సర్టిఫికెట్ ఇస్తున్న నేనే నీ ట్రాన్స్‌ఫర్‌ని కావాలనే తాత్సారం చేశాను"

మనసు చదివినట్టు బాస్ అలా అనేసరికి ఉలిక్కిపడ్డాడు గోపాలం.

"ఎందుకో తెలుసా? నీకు ప్రమోషన్ రావడానికి సిఫారసు చేశాను కాబట్టి. ఆర్డర్స్ వచ్చాకే సర్‌ప్రైజ్ చేద్దామనుకున్నాను. బట్... ఎందుకనో లేటవుతోంది. ఈ వారంలోగా ఆర్డర్స్ నీకు అందే ఏర్పాట్లు చేస్తాను. ఏకంగా కొత్త హోదాలో ట్రాన్స్‌ఫర్ కావొచ్చు"

అదిరిపడ్డాడు గోపాలం. అతనూహించనిదీ ప్రమోషన్. ఇంకా ఏ అయిదారేళ్ళకో రావాల్సింది. ఇంత ముందుగా...?

'ఇలాంటి బాస్ గురించేనా ఏదేదో ఊహించేసుకున్నాను. ఎంతెంత బురద చల్లాలనుకున్నాను. మనిషి వెనక మనసు తెలుసుకోలేక పోయా!' అప్రయత్నంగా గోపాలం కళ్లు ఆనందాశ్రువులయ్యాయి.

"నీ మానసిక సంఘర్షణ నీ మొహం చూస్తేనే తెలుస్తోంది. రేప్పొద్దున నా ప్లేస్‌లో నీవున్నా నాలానే ప్రవర్తిస్తావు. ప్రవర్తించాలి. బాస్ బాస్‌లాగే ఉంటూ సబార్డినేట్స్ చేత వర్క్ చేయించాలి. బాసిజం మోతాదు మించనంత వరకు బాస్‌కి - సబార్డినేట్స్ మధ్యగల సయోధ్యకి చిల్లు పడదు. ఆఫీసూ బావుంటుంది. అందరికీ పేరొస్తుంది. నేనొకటి నీ నుండి ఆశిస్తున్నా. నిజాయితీ మరవొద్దు. ఏ 'ఫలితమూ' ఆశించొద్దు...' ఆగాడు బాస్.

గోపాలానికి మూర్తి... బాస్‌లా కాదు. దక్షత మూర్తీభవించిన వ్యక్తిలా అగుపించాడు.

చప్పున దగ్గరగా వెళ్ళి చేతుల్లో చేయి వేసి "థాంక్యూ సర్! థాంక్యూ వెరీమచ్" అని మాత్రం అనగలిగాడు ఆనందాతిశయంతో.

★